# "కుడి ఎడమల ...."

- చీకోలు సుందరయ్య

"అమ్మయ్య! పందొమ్మిది వందల ఎనభై రెండవ సంవత్సరం వచ్చి ఒక్క నెలా ఇరవై ఎనిమిది రోజులయిపోయిందబ్బా!" ఉద్యోగిలా లెక్కపెట్టుకుంటూ పడకమీద వాలిపోయాడు సూర్యుడు. సుల్తాన్‌బజారులోని శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం మునుపెన్నడూ చూడనంత జనసందోహంతో క్రిక్కిరిసి మురిసిపోతోంది. అక్కడ కార్లులేవు, స్కూటర్లు లేవు, సూట్లులేవు, బూట్లు లేవు, కంచిపట్టుచీరలు లేవు. లిప్‌స్టిక్ పెదవులులేవు. సెంటువాసనలులేవు. తెచ్చిపెట్టుకున్న నవ్వులు అసలే లేవు. అక్కడ ఉన్నదంతా,

పొద్దుట్నుంచీ కర్మాగారాల్లో మరయంత్రాల మీద, మనసులేని మనుషుల అజమాయిషీ క్రింద పనిచేసి అలసి సొలసి చెమటపట్టిన ముఖాలు..

ఆఫీసుల్లో ఆఫైలు...ఈఫైలు...వెతికి కనపడక ఆఫీసరుచేత తిట్లుతిని...యింక ఈ బ్రతుకింతేలే అని నిర్ధారణచేసికొన్న ఏడుపు ముఖాలు.

ఎత్తాల్సిన బిడ్డను ఎత్తి, దించాల్సిన బిడ్డను దించి, వండి, వార్చి, ఇంటిల్లిపాదికి సేవలుచేసి నడుం వంగిన నారీలోకం...

ఎత్తైనరోడ్లల్లో, ఇరుకు సందుల్లో, తొక్కు రిక్షాలు లాగిలాగి రోడ్డుకంటుకుపోతున్న రిక్షారాముళ్ళు.

సమ్మెల్లో బస్సులపై రాళ్ళువేయని వాళ్ళు.
ఎన్నికల్లో అమ్ముడుపోతున్న వాళ్లు.
కాలానికి ఎదురీదుతున్న వాళ్లు.
కడుపులు మాడిన వాళ్లు.
కన్నీళ్లు కార్చేవాళ్లు,

కాలం మారాలనే వాళ్లు...వీళ్లే!......అందరూ వీళ్ళే!!

వీళ్లంతా ఎందుకు గుమికూడారిక్కడ?

ఏదైనా సినిమా ఉచితంగా ప్రదర్శిస్తున్నారా? ప్రదర్శిస్తున్నట్లు ఎక్కడా ప్రకటించినట్లులేదే! ఏ వార్తాపత్రికలోనూ, ఏ థియేటరులోనూ ఎటువంటి ప్రకటనకానీ, స్లైడు కానీ లేదే!? మరి విస్తృతంగా కరపత్రాలు పంచారా? అదీలేదే!

ఎవరైనా రాజకీయ నాయకులు విచ్చేశారేమొ! అయినా రాజకీయనాయకులయితే బడా బడా బాబులు, ముందువెనుకల తెల్లని నల్లని కార్లు రావాలే. అందులోనూ యిది ఎన్నికల సీజను కాదుకాబట్టి వాళ్లకు ప్రజల పాడుముఖాలు చూడాల్సిన కర్మ ఏం పట్టింది?

బహుశ రికార్డు డాన్సేమైనా పెట్టిస్తున్నారా? ఏ జయమాలినో, సిల్క్ స్మితో రావచ్చేమొ! ఛ...వాళ్ళైతే వంద రూపాయల టిక్కెట్టుండదూ?... వీళ్ళంత తెరమీది బొమ్మలు చూడ

వలసినవారేగానీ నేలటిక్కెట్లో కూర్చొని; వాళ్ళని స్టేజీమీద చూసేంత అర్హత వుందా ? మరైతే ఎవరబ్బా ?

ప్రభుత్వాధికారులా ?... పోలీసధికారులా ? ?
పిచ్చిగానీ వాళ్ళకి ఈ పూర్ పీపుల్‌తో పనేముంటుంది ?

అర్థమైంది. ఆస్థాన కవో, గాయకుడో, నటుడో, నటో ఎవరో అయి వుండొచ్చు. అబ్బబ్బ ఎంత ఫూలిష్‌గా ఆలోచిస్తున్నాను. ప్రభుత్వ ఆస్థానంలో వుండేవాళ్ళకి, ప్రజల సమస్యలతోకానీ, వాళ్ళను చైతన్యవంతులచేసే భావాలతోకానీ, వారి ఆలోచనలతో కానీ, కష్ట సుఖాలతో కానీ, పనేముంటుంది? వాళ్ళ పదవులను పర్మనెంట్ చేయించుకోవడంలోనో, ప్రభుత్వం వాళ్లేర్పాటు చేసే కార్యక్రమాలలో తామెంతఎక్కువసేపు సభావేదికమీదకూర్చొని ముసిముసి నవ్వులు చిందిస్తూ, మచ్చుకైనాలేని గుణాలన్నిటినీ మంత్రివర్యుల కాపాదిస్తూ, వారి మన్ననలు పొందుదామా అనే నిరంతర కృషిలోనో, తమ బంధుమిత్ర వర్గాల వాళ్ళకు ఉద్యోగాలు, రంగ ప్రవేశానికి ఛాన్సులు, గుర్తింపు వగైరా ఎలా పొందడమా అనే ఆలోచన తప్ప ప్రజలతో అదీ ఈ పూర్ క్రీచర్స్‌తో ఏంపనీ ? ? ఆఁ గుర్తొచ్చింది ! ఈ మధ్య సాంస్కృతిక వ్యవహారాల శాఖవాళ్ళు తెగ పెట్టిస్తున్నారు ప్రోగ్రాములు. వాళ్ళేదైనా ప్రోగ్రాం ఏర్పాటు చేశారేమొ ? అయినా ఒక సందేహం. వాళ్ళు పెట్టే ప్రోగ్రాములకు ఇన్విటేషన్లు, నగరంలో పేరు మోసిన వాళ్ళకు (వారెప్పుడూ ఈ ప్రోగ్రాములకు రారుసుమా !) అసెంబ్లీ, సెక్రటేరియట్‌లలో పనిచేసే కొంతమందికి, వాళ్ళ బంధువులకు, స్నేహితులకు అంతేకదా ? !

మరి వీళ్ళెలా వస్తారు? వాళ్ళు కాదన్నమాటేగా? కావచ్చుకానీ, ఇంతవరకూ జ్ఞప్తికి రానేలేదు, ఆలిండియా రేడియోవాళ్ళు ఆహ్వానితుల సమక్షంలో ఏర్పాటుచేసిన సంగీతకచ్చేరీ ఏమో! వాళ్ళు నిర్వహించే మహత్తరమైన కచ్చేరీలు, రవీంద్రభారతిలోనో, త్యాగరాజగానసభలోనో జరుగుతాయి. పైగా వాళ్ళ ప్రోగ్రాములకు ముందు నాలుగువరుసలు నిండితే ఎంతో గొప్ప ! వాళ్ళకు DIG నో, ప్రభుత్వ కార్యదర్శో, అలాంటివారు మరొకరో, వాళ్ళ బంధువో, లేకపోతే వాళ్ళ శాఖకో, వర్గానికో చెందిన వాళ్లనో అదీకాకపోతే తమ ప్రాంతానికో, గ్రామానికో కనీసం స్కూలుకో చెందిన వాళ్లను పిలవడం ఆచారం...... ఎప్పట్నించో వస్తున్నదేకదా ! వీళ్లంతా ఎందుకంటా ? అవును ...అదీ పాయింటే

కొంపదీసి ఇది దూరదర్శన్ ఏర్పాటుచేసిన కార్యక్రమం కాదుకదా ? నిజమైన కళాకారులకు దూరదర్శన్ ఎప్పుడైనా అవకాశమిచ్చిందా నా పిచ్చిగానీ ! ఆమధ్య ఒకాయన చెబుతుండేవాడు, ఎంతో కష్టపడి తయారుచేసిన కార్యక్రమం తాలూకు స్క్రిప్టును దూరదర్శన్ పరిశీలనార్థం పంపిస్తే ఏండ్లుగడచిపోయినా సమాధానంరాలేదని. వాళ్లకసలు ప్రభుత్వ పథకాలు, కేంద్రమంత్రుల పర్యటనలు తప్ప, ఈ పేదప్రజలతో కలసి వారిని ఎడ్యుకేట్ చేసే స్థాయికి మన దూరదర్శన్ దిగజారిందా ? ఆశయాలు వేరు......అమలుపరిచే విధానాలు వేరేమరీ !! మరైతే ఎందుకు వీళ్లంతా యిక్కడ పోగయ్యారు ?

అదేదో వాళ్ళనే అడిగితే చెప్పరూ ? అయినా వాళ్ళని విసిగించడం దేనికీ ప్రశ్నలతో.కూర్చుని చూస్తుంటే అది మన కళ్ళముందు కూడా పడక తప్పదు కదా !

అరెరే స్టేజీమీద ఎవరో మాట్లాడుతున్నారే. ఎవరబ్బా ?

పత్తిపాటి వెంకటేశ్వర్లుగారిలా వున్నారే. ఆ ప్రక్కన్నే నిలబడ్డాయన ఎవరో ఏవేవో కాగితాలు పట్టుకోనున్నారే. ఆఁ తెలిసింది. ఆయనేనేమొ వాడపల్లి శ్యామసుందర్ మరి ఆ మూలగా నిలుచున్నాయన ఎవరబ్బా ? చాల బిజీగా వున్నట్టున్నాడు... సుబ్బారావు కాదుకదా ! ఏఁవిటీ అందరూ లేచిలేచి నిలబడుతున్నారు ? అబ్బబ్బ తొక్కి చంపేస్తున్నారే. ఈ జనాలకున్న పాడు బుద్ధే యిది ! ఎందుకిలా తోసుకుంటారో అర్ధమే కాదు. కొంపలంటుకు పోతాయా ... ఏం ? ! కూర్చుని చూస్తే. స్టేజీమీదకి ఎవరో కొత్తవాళ్ళు వచ్చినట్లున్నారే ! పూలదండలు కూడా వేస్తున్నారు ...పేర్లు తెలిసిచావడల్లేదే ! తైలరహితమైన తెల్లని జుట్టు, ఇస్త్రీముఖం ఎరుగని తెల్లచొక్కా, ఇప్పుడిప్పుడే జబ్బునుండి కోలుకొంటున్నట్లున్న ముఖం, ఏదో మహదానందంతో మెరిసిపోతున్న కళ్ళు...ఎవరబ్బా ఈయన ? ఎక్కడా చూసినట్లు లేదే? !

ఆయన ప్రక్కన్నే కూర్చొన్నది మాత్రం

ఎప్పుడూ ధవళవస్త్రాలతో తీవికురిపిస్తూ నవాబు నెదుర్కొన్న ఎంచక్కని మీసంతో, వృద్ధాప్యంలో సైతం తీసిపోని ఆత్మాభిమానంతో వేదికకు నిండుదనాన్ని కూర్చుతున్న కాళోజీ కదూ ? ఇంతకీ ఆ దండలన్నిటినీ మోస్తున్న వ్యక్తెవరో తెలియడంలేదే !

ఎవరైతే నాకేం ?

అదేంమాట ! ఎవరో గొప్పవాడయ్యేవుంటాడు కాకపోతే దండలన్నీ ఆయనకే ఎందుకేస్తారు ? గొప్పవాడయితే కాస్ట్లీ బట్టల్లోనో, రంగుటద్దాల్లోనో ...శేషేంద్రశర్మలాగన్నా మంచి అందమైన పట్టు వస్త్రాల్లోనో డాంభికంగానే వుండాలే ? ఇతనెవరబ్బా?

ఆఁ తెలిసింది ?

జీవితాంతం పౌరాణిక నాటకాల్లో పాత్రలు ధరించి, సినిమా దెబ్బకు నాటకాలు మూలపడితే, జీవనాధారంలేక నిష్ప్రయోజకులైన కొడుకులను చూస్తూ, ఎదిగిన కూతుళ్లను మోస్తూ, గత వైభవాన్ని అనుక్షణం స్మరిస్తూ, పొట్టచేత్తో పట్టుకొని వీధంబడే తిరుగుతున్న ఆనాటి మేటి పౌరాణిక నటుడేమొ !

నటుడైతే ఆ ముఖంలో హావభావ విన్యాసాలు ప్రస్ఫుటంగా కనిపించాలే ! ఈయనలో అలాంటివేమీ కనపడటంలేదే. అయితే నటుడు కాదన్నమాటేగా...కావచ్చు...

ఈసారి మాత్రం డెఫినెట్. నోడౌట్ ఈయన గాయకుడే...సరిగమ పదనిస స్వరాలను సక్రమంగా పలుకలేని వాళ్ళంతా గాయకులై, సంగీత దర్శకులై కోట్లు గడిస్తుంటే, సాంప్రదాయమే సంగీతమంటూ మడికట్టుకొని...ఎండి పోతున్న గొంతుకలో మాయామాళవగౌళరాగం నుండి కదనకుతూహలరాగం వరకు...త్యాగయ్య నుండి అన్నయ్య వరకుగల నాదబ్రహ్మల మృదు మధుర సంగీత ఝురులను కురిపిస్తూ చిల్లులు పడి కారుతున్న ఇంటి చూరును, హాయిగా నిద్రపోతున్న పొయ్యినీ చూడుడని వేడుకుంటున్న ఆదరణలేని సంగీత చక్రవర్తా ? అయిన పిచ్చిగానీ అలాంటి వాళ్ళకి వాకిళ్లు, ప్లాట్‌ఫారమ్‌లేగానీ హాళ్ళుకూడనా, ఒకవేళ గాయకుడైతే హార్మోనియమైనా, తంబురా అయినా కనిపించదా ? వినిపించదా ? మరి అవి లేనట్టే వుంది.

పాపం ! ఏం కష్టాలొచ్చాయో ఏమో ?

ఆదె మైకులో ఏదో చెపుతున్నారు...విందాం

"జంటనగరాల పౌరులు, సంస్థలు, విద్యాలయాలు, కళాకారులు, కార్యాలయాల నుండి వసూలైన మొత్తం రు. 12,892-16లు" అబ్బ చాలా మొత్తమేనే. అతి తక్కువ వ్యవధిలో ఫరవాలేదే బాగానే వసూలు చేశారు.

కాళోజీ గారేదో మాట్లాడు తున్నట్టున్నారు. అబ్బా...ఏమీ విననివ్వరే వీళ్లు...

"ఈయన బ్రతికినంత కాలం నెలకు యాభై రూపాయల చొప్పున ప్రతినెల వారి అడ్రసుకు పంపుతాను.

ఎంత చక్కని మాటపలికావయ్యా కాళోజీ తాతయ్యా నీలాంటి మనస్సు ఈ దేశంలో కోటి కొక్కరికిఉన్నా కళామతల్లి ముద్దు బిడ్డలు వీధుల పాలు కానక్కరలేదు కదా !

అరెరెరె ఎవరో అమ్మాయి స్టేజీ మీదకు వెళ్తోందెందుకని ? గాజులు విడతీస్తోంది...తళ తళ మెరిసిపోతున్న జత బంగారుగాజులు. ఓ మూడువేలు చెయ్యొచ్చేమొ ! కొంపదీసి బహూకరించడు కాదుకదా !? అబ్బా...ఎంతదాతృత్వం ! వాటిని యివ్వనే యిచ్చేసిందే ! ఆమె హృదయం ఎంతగా కదిలిందో! ఆమె పేరేమిటో? పేరెందుకు?

పేరుప్రతిష్ఠలకోసం దానధర్మాలుచేసేవాళ్లు... దానంచేస్తున్నామహో అని దండోరావేయిందుకునీ, సంవత్సరం గడచిన తర్వాత కూడా దాన్ని ముట్ట చెప్పరు. అవసరంలో వున్న వ్యక్తికి సాయం చేయడం ముఖ్యం. దానిని కూడా వ్యాపార దృష్టితో......ఇన్‌కమ్‌టాక్సు ఎగ్గొట్టడానికి చేయడం...దానమెలా అవుతుంది ?

పాపం...ఆమె సామాన్య స్త్రీ......అందుకే అంత ఔదార్యం...ఆమె విశాల హృదయానికి జోహార్లు...ఆ మూలనున్న వ్యక్తి ఏదో అంటున్నాడు.

"ఆమె మా వీధిలోనే వుంటుందండి ... పేరు రత్నమాల" బాగుంది. ఆమెపేరు రత్నమాలా. మనసు పూలమాల...

హాట్స్ ఆఫ్ టు యు రత్నమాల.

* * *

మర్నాడు అదేవ్యక్తి, అందరి అభిమాన ధనాన్ని మోసుకొనిసికిందరాబాదుస్టేషనులోరైలెక్కడానికి పోతుంటే ఓ చిరుద్యోగి పరిగెత్తుకుంటూ వెళ్లి, ఓ పదిరూపాయలనోటు ఆయన చేతుల్లో పెట్టి...కాళ్ళకు దణ్ణంపెట్టి వెళ్ళిపోయాట్ట!

ఇలా రాసుకుపోతూవుంటే...ఎంతో వుంది...

ఆ వ్యక్తి ఎవరో తెలుసా !?

ఉన్నశక్తినీ, చేవనూ, కాలాన్నీ తెలుగు సినీ రంగం జుర్రుకోగా కోర్టుపాలైన ఇంటిని విడిపించుకోలేక, అభిమానుల పిలుపుకు బదులుపలికి వారు అత్యంతాభిమానంతో సమర్పించిన చిరుకాన్కను గ్రహించిన వ్యక్తి !

ప్రతిక్షణాన్నీ పేదలకోసం వినియోగించి కన్నీటికి భాష్యంచెప్పిన విప్లవశక్తి !!

ముద్దులతో నిండిపోయిన తెలుగు సాహిత్యం హద్దులు చెరిపి ఆకలిమంటకు పట్టంగట్టిన ప్రజాకవి !!!

ప్రాచీనాంధ్రసాహిత్యంలో మరేకవి అధిష్ఠించని మహోన్నతమైన స్థానాన్ని అధిష్ఠించిన కవిసామ్రాట్టును "కవిరాజు కంఠంబు కౌగిలించెనుగదా పురవీధి

నెదురెండ పొగడదండ" అటువంటి నికృష్టమైన స్థితికి గురిచేసిన జాతి మనది......

మొన్న, వచనప్రక్రియలో విశిష్టమైన, సునిశితమైన హాస్యాన్ని జొప్పించి కలకాలం నిలిచే "సాక్షి" వ్యాసాలను మన జాతికి కల్పించి, తుది దినాల్లో నిరుపేదజీవితాన్ని గడిపి నిరుపేదగా కన్నుమూసిన పానుగంటి లక్ష్మీనరసింహం పంతులు గారిని చూస్తూ మిన్నకుండిన మనుషులం మనం...

నిన్న "మా తెలుగుతల్లికిమల్లెపూదండ"ను వేసి తెలుగుతల్లి ఆరాధనలో వళ్లుమరచి ''మురిపాల ముత్యాలు దొరుకుతాయి'' అంటూ గానంచేస్తూ, తిరిపెమెత్తుకొని శంకరంబాడి సుందరాచారి తిరుపతి వీధుల్లో తిరుగుతుంటే, పిచ్చివాడని హేళన చేస్తూ పట్టించుకోని చరిత్ర మనది.........

[నేడు, విరసమా? అరసమా? అంటూ జాతికి నవ్వాళ్ల ధ్వజమెత్తి చనిపోయిన తర్వాత కూడా ..పాడిదగ్గర సైతం...పోట్లాడుకునే స్వభావం మన తెలుగు వీరులదే.].........

ఒక వ్యక్తి గొప్పతనాన్ని చచ్చినతర్వాత గుర్తించి, సంస్మరణసభలు, జయంతులు, వగైరా జరిపించే మహోన్నతమైన వ్యక్తిత్వం మనదే...

[తెలుగువారి వింతమన స్తత్వానికి, కుళ్లుమోతు తనానికి, నిర్దయకు గురైన నిరుపేద కవి!!!!]

మనలో ఒకడై, మహిలో అసామాన్యుడై భూనభోంతరాలు దద్దరిల్లేలా గర్జించి, లక్షలాది వారసులను సృష్టించి భౌతికంగా కళ్లుమూసిన విప్లవ కవి !!!!!

ఏ కవిసామ్రాట్టులు, కవికోకిలలు, పద్మశ్రీలు ...నోచుకోని అసంఖ్యాక జనహృదయాభిమానాన్ని దోచుకొని సుదూరలోకాలనేలడానికి నిన్న (జూన్ పదిహేను 1983న) పయనం కట్టిన మహాకవి.

కుడిన శ్రీ ఎడమ శ్రీ

కుడిఎడమల శ్రీ శ్రీ

ఆలోచనలను, అసిధారలను, ఆదేశాలను,

అగ్ని కీలలను అలరించిన క్రాంతిమూర్తి శ్రీశ్రీ.

— డాక్టర్ సి. నారాయణరెడ్డి